
కథ

# అమ్మ మనసు

ముసునూరు రాజేశ్వరి



'అమ్మా...! స్కూలు ఫీజు కట్టలేదని ఈ రోజు నన్ను క్లాసులో నిలబెట్టారు. అందరిలో షేమ్ అయిపోయాను.' స్కూలు బ్యాగ్‌ను టేబుల్‌పై పెడుతూ  ఏడుపుగొంతుతో అన్నాడు చిన్నా.

వాడి మొహం వైపు చూసింది లలిత. చిన్నబోయి ఉంది. వాడినలా చూసేసరికి కడుపు లోంచి బాధ తన్నుకొచ్చింది. చటుక్కున వాడిని దగ్గరకు తీసుకుంది. 'రేపు కడదాంలే...' ఊరడింపుగా అన్నది.

'రేపు, ఎల్లుండి హాలిడేస్ అంట. మళ్లీ మండేనాడు కట్టకుంటే ఇంక నీవు రానక్కర్లేదు స్కూలుకు' అని చెప్పారమ్మా!

వాడి బాధను అర్థం చేసుకోగలను. కానీ ఏం చేయాలి? వాడి స్కూలు ఫీజు కట్టాలంటే ఇలా ప్రతిసారి ఆలస్యమే అవుతోంది. ఎక్కడో ఒకచోట తీసుకురావడం, మళ్లీ వారికి చెల్లించడం సరిపోతోంది. గత ఆర్నెల్లుగా ఇదే తీరు. 'అమ్మా! మాట్లాడమ్మా!' చీర కుచ్చెళ్లు పుచ్చుకుని గుంజుతున్నాడు చిన్నా. ఆలోచనల్లోంచి బైటపడింది.

'ఏమిటిరా?...'

'అమ్మా... ఆకలేస్తోందమ్మా!... ఈరోజు నూడుల్స్ చేస్తానన్నావుగా. చేశావా!'

'ఆ.. ఆ .. చేశాను. ఉండు పట్టుకొస్తాను.' చిన్న గిన్నెలో వేసి ఇచ్చింది. వాడు ఆకలిమీద ఉన్నాడేమో, గబగబా తినేస్తున్నాడు. వాడిని చూస్తూనే ఆలోచనలో పడింది. ఇపుడు చిన్నా అయిదో తరగతి చదువుతున్నాడు. ఇప్పుడే వాడి ఫీజు కట్టడానికి తిప్పలు పడాల్సి వస్తోంది. ఇక ముందు ముందు ఎలానో?

ఎలా? ఇపుడు ఎవరిని అడగాలి. ఆయనేమో మళ్లీ వారానికి గాని ఇంటికి రారు. చేతిలో చిల్లర డబ్బులు తప్ప ఇంకేమి లేవు. ఒకవేళ ఆయన వచ్చినా డబ్బులు తెస్తారని గ్యారంటీ ఏమీ లేదు. ఆయనపై ఆశ పెట్టుకోవడం అనవసరం. తానే సర్దాలి. అదే ఎలా?...చుట్టుపక్కల ఉన్న వారిని అరువులు అడగడం, ఎలాగో తంటాలు పడి చెల్లించడం మామూలైపోయింది. దాదాపుగా ఇక్కడ అందరిదీ తమలాంటి ఆర్థిక పరిస్థితే. పైగా నెలాఖరు. ఎవరి దగ్గరా అంత మొత్తం ఉంటుందని అనుకోవడానికి ఆస్కారం లేదు. ఎవరిని అడిగినా అదేమాటంటారు.

వంట చేస్తున్నా ఇదే ఆలోచన. ఎందుకిలా తమ పరిస్థితి తారుమారయ్యింది. తానే అడిగిన వారికి లేదనకుండా ఇచ్చేది. ఈయన చిట్‌ఫండ్ వ్యాపారం పెట్టి కింద వారిపై భరోసాతో చేతు తెచ్చుకున్నారు. నిండా మునిగిన వారికి చలేమిటన్నట్లు ఉన్న ఆస్తులన్నీ అమ్మి అప్పుల వారికి చెల్లించి తాము ఇలా ఊరు విడిచి పొట్ట చేత బుచ్చుకు రావాల్సి వచ్చింది. ఆయన ఇంకెక్కడా జాబ్‌లో సెటిల్ కాలేదు. ఊరిలో రావాల్సిన డబ్బుల కోసం తిరుగుతూ, ఎవరైనా ఇస్తే వాటిని తీసుకుని ఇంటికి చేరుకుంటున్నాడు. 'ఇలా ఎన్నాళ్లు?' అని అడిగితే, 'చూద్దాం... నిన్ను, బాబును పస్తులయితే ఉంచడం లేదు కదా!' అంటాడు. కానీ ఇలా ఎన్నాళ్లు? తన మనసులో నిత్యం మెదిలే ప్రశ్న ఇది. దీనికి సమాధానం దొరుకుతుందా?

'అమ్మా! టీవీ రావడం లేదేమిటి?'... చిన్నా ప్రశ్నతో ఉలిక్కిపడింది.

నెలవారీ బిల్లు కట్టకపోతే కేబుల్ అతను కనెక్షన్ పీకేశాడని కొడుకుతో చెప్పలేకపోయింది. వాడి చిన్నారి మనసును మరింత కుంగదీయడం ఇష్టం లేక, 'కనెక్షన్ ఊడిపోయి ఉంటుందిలే, రేపు అతన్ని పిలిపించి సరిచేయిద్దాం! కాసేపు పక్క వాళ్ల బాబుతో క్యారమ్స్ ఆడుకో!'... అని చెప్పింది. వాడు హుషారుగా వెళ్లాడు.

★★★

ఆ రాత్రి చలిగాలి జివ్వుమని సోకింది. పక్కనున్న దుప్పటి తీసుకుని కప్పుకుందామని కళ్లు తెరిచింది లలిత. ఎక్కడో కుయ్యి కుయ్యి మంటూ శబ్దం విన్పిస్తోంది. పక్కనే పడుకున్న చిన్నా కూడా చటుక్కున లేచాడు. 'అమ్మా! ఏమిటది?' అని అడిగాడు. 'వర్షం వస్తున్నట్లుంది. చలిగాలి వీస్తోంది. కప్పుతాను పడుకో...' అని దుప్పటి తీసి చిన్నాకు కప్పింది. మళ్లీ కుయ్యి కుయ్యి మంటూ విన్పించింది. తల్లీ కొడుకులు మొహమొహాలు చూసుకున్నారు.

'అమ్మా! ఆ శబ్దమేమిటి?'...

'బహుశా కుక్కపిల్లేమోరా!'...

'అవునా?... అయితే చూద్దాం అమ్మా!'... అంటూనే లేచి కూర్చున్నాడు.

'సరే చూద్దాం పద'... అంటూ లేచి లైట్ వేసి తలుపు గడియ తీసింది. వసారాలో గోధుమ రంగులో ఉన్న కుక్కపిల్ల వణుకుతూ కుయ్యి కుయ్యిమని అరుస్తూ ముడుచుకుని పడుకుని కన్పించింది. లలితను చూడగానే చటుక్కున వచ్చి ఆమె చీర కుచ్చెళ్లలో దూరింది. మెత్తగా కాళ్లకు తగలడంతో ఒళ్లు జలదరించింది. ఛీ.. .ఛీ... అని కాలుతో తన్నబోయింది. అంతలోనే చిన్నా ఒంగి దాన్ని ఎత్తుకుని ఒడిలోకి తీసుకున్నాడు.

'ఒరేయ్...దాన్ని ముట్టుకోకు... అది వీధి కుక్కలా ఉంది. దాని ఒంటినిండా మురికే. ఎక్కడ పొర్లాడి వచ్చిందో ఏమో... వదిలేయ్'... చికాగ్గా, కంగారుగా అనేసింది.

'అమ్మా!... దీన్ని చూడు... ఎలా వణుకుతోందో, పాపం... ఈ రాత్రికి మనింట్లో ఉంచుకుందాం. నీకిష్టం లేకపోతే రేపు వదిలేద్దాంలే! ' ...అమ్మ ఏమంటుందోనంటూ ఆమె మొహం వైపు చూశాడు.

కొడుకు మొహంలో కన్పిస్తున్న జాలిని చూడగానే ఆమెకు గట్టిగా కాదు, కూడదని అనాలన్పించలేదు. 'సరే, చలిగాలి వీస్తోంది. లోపలకు తీసుకురా!...' అని లోపలకు రాగానే తలుపుకు గడియ పెట్టింది. కుక్కపిల్ల కుయ్యి కుయ్యిమని అంటూనే ఉంది. గట్టిగా ఉన్న తన పాత చీరను పెట్టెలోంచి బైటకులాగింది. దాన్ని ముడతలు వేసి గదిలో ఒక మూలన పరిచింది. అప్పటివరకు చిన్నా ఒళ్లో మునగదీసి పడుకున్న కుక్కపిల్లను ఆ చీరపై పడుకోబెట్టమని చెప్పింది. చిన్నా దాన్ని పడుకోబెట్టి భయం లేదులే...అన్నట్లు దాన్ని తడుతూ పక్కనే కూర్చున్నాడు. అది ఇంకా వణకుతూ



మూలుగుతోంది.

'అమ్మా ! ఇంకా మూలుగుతోంది. చలిగా ఉందేమో... కప్పడానికి ఇంకేదైనా ఇయ్యి!...'

'అక్కర్లేదులేరా!... అదే పడుకుంటుంది... నీవు రా ఆ డ్రెస్ మార్చుకుని చేతులు కడుక్కో!'... అయిష్టంగానే అక్కడ నుంచి కదిలాడు. చిన్నా వెళ్తుంటే కుక్కపిల్ల వాడి వంకే చూస్తూ ముడుచుకుని పడుకుంది.

చిన్నా పక్క ఎక్కగానే లైట్ తీసి తానూ పడుకుంది లలిత. మధ్యలో చిన్నా లేచి కుక్కపిల్ల ఏం చేస్తోందా! అని చూస్తూనే ఉన్నాడు. దాని మెరిసే కళ్లను చూసి 'ఇది ఇంకా పడుకోలేదే'....అని అనుకుంటూనే కిందకు దిగితే అమ్మ కోప్పడుతుందేమోనన్న భయంతో పడుకునే దాన్ని చూస్తూ నిద్రలోకి జారుకున్నాడు.

★ ★ ★

తెల్లవారిందో, లేదో చటుక్కున లేచి కూర్చున్నాడు చిన్నా. కుక్క పడుకున్న వైపు చూశాడు. అది లేచి తోక వూపుకుంటూ అటూ ఇటూ తిరుగుతోంది. చిన్నా మంచంపైకి ఎక్కాలని చూస్తోంది. అది పైకి ఎక్కేలోపే చిన్నా చటుక్కున కిందకి దిగాడు. లలిత లోపల్నుంచి వచ్చి చూసేసరికి చిన్నా, కుక్కపిల్ల పరుగులు పెడుతూ ఆడుతున్నారు.

'ఏయ్ చిన్నా...దానిని బైటకు పంపేయ్!' అరిచింది లలిత. అంతే ఇద్దరూ చటుక్కున నిలిచిపోయారు. చిన్నా ఏడుపు మొహం పెట్టాడు. 'అమ్మా! ప్లీజ్ ...దీన్ని మనం పెంచుకుందామే'. 'ఏయ్...అది వీధి కుక్కరా... మనింట్లో వద్దు... పంపించేయ్...' అసహ్యం అంతా ఆమె మొహంలోనే చూపిస్తూ అంది లలిత. ఆమె అలా అనేసరికి చిన్నాకు ఏడుపు తన్నుకొచ్చింది. 'అమ్మా... ఈ రెండు రోజులు నాకు సెలవులేగా... దీనితో ఆడుకుని తర్వాత వదిలేస్తాలే...' అని ఏడుపు గొంతుతో చెప్పాడు. వాడినలా చూడగానే ఎక్కడో కలుక్కుమంది అమెకు. 'సరే... ఆ తర్వాత వదిలేస్తావుగా!'...మళ్లీ రెట్టించి అడిగింది. 'ప్రామిస్ అమ్మా!'... అంత గట్టిగాను చెప్పాడు చిన్నా.

'అది ఇల్లంతా తిరిగేస్తోంది. మురిగ్గా ఉంది. దానికి ముందు స్నానం చేయించాలి. బాత్రూమ్‌లో బకెట్లో నీళ్లున్నాయి'...చెప్పింది. చిన్నా దాన్ని ఎత్తుకుని బాత్రూమ్‌లోకి తీసుకువెళ్లాడు. వాడెలా చేయిస్తాడో... ఏమో...అన్పించి తానే వెళ్లింది లలిత. దాన్ని ముట్టుకోవాలంటే ఇష్టం లేకున్నా శుభ్రంగా స్నానం చేయించింది. తర్వాత ఒక పాత బట్టను తీసుకుని తుడిచి కాసేపు ఎండలో నిలబెట్టమని చిన్నాతో చెప్పింది. చిన్నా దాన్ని బైటకు తీసుకువెళ్లగానే చుట్టూ పిల్లలు మూగారు.

'చిన్నా పాలు తాగి వెళ్లు'... పిలిచింది. 'అమ్మా... మరి దీనికో' ...కుక్క పిల్లను చూపించాడు. లలితకు ఏమి చేయాలో అర్థం కాలేదు. దానికి పాలు లేవు. '.సరేలే దానికి ఏదో ఒకటి పెడతాను కానీ నువ్వు తాగు '...అని చెప్పింది. సరే అని వాడు గ్లాసు తీసుకుని వెళ్లి ఓ ప్లాస్టిక్ బౌల్‌లో సగం వరకు పాలు పోసి దాని ముందు పెట్టాడు. ఇదంతా గమనిస్తున్న లలిత మనసు చిన్నబోయింది. తాను కాఫీకి అని ఉంచుకున్న పాలను కుక్కపిల్లకు పోసింది. మరో పాలప్యాకెట్ తెప్పించాలంటే తన వద్ద డబ్బులు లేవు. ఉన్నదానితోనే సరిపెట్టుకోవాలి మరి.

★ ★ ★

సాయంత్రం నాలుగు దాటింది. రోజంతా చిన్నా కుక్కపిల్లతో గెంతులేస్తూనే ఉన్నాడు. అటూ ఇటూ తిరుగుతున్నా లలిత మనసులో మెదులుతున్న ప్రశ్న... 'ఫీజుకి డబ్బెలా?'... రాంబాయమ్మ గారు ఏదైనా సలహా ఇస్తారేమో! అడిగి చూద్దాం! అన్పించింది. చటుక్కున లేచి చెప్పుల్లో కాళ్లు దూర్చి 'చిన్నా!... ఇంట్లోనే ఉండు. ఇప్పుడే వస్తా!' అని చెప్పి ఆ కాంపౌండ్‌లోనే ఉన్న రాంబాయమ్మ గారింటికి వెళ్లింది. ఆమె ఇంట్లోనే ఉంది. లలితను చూడగానే నవ్వుతూ ఆహ్వానించింది. సాధారణంగా లలిత రాదని తెలుసు ఆమెకు... కూర్చోమని కబుర్లు చెప్తోంది. కానీ లలిత మనసు వాటిపై నిలపడంలేదు. అది గ్రహించిన ఆమె 'ఏమ్మా! ఏదైనా పనిమీద వచ్చావా?' అని అడిగింది. తటపటాయిస్తూనే విషయాన్ని వివరించింది.

'నెలాఖరై పోయింది... నా చేతిలో కూడా డబ్బులేదు. ఏం చేద్దాం?'... రాంబాయమ్మ అలా అనగానే లలిత మొహంలో అసహాయతతో కూడిన దీనత్వం కన్పించింది. అది చూడగానే ఆమె 'లలితమ్మా! కంగారుపడకు... ఏదో ఆలోచిద్దాంలే!'... అని భరోసా ఇచ్చింది.


'వడ్డీకయినా తీసుకుందామా?'... లలితను అడిగిందామె.


'ఆ...ఫర్వాలేదు'... ఏమాత్రం వెనకాడకుండా సమాధానమిచ్చింది.


'ఒక్క నిమిషం కూర్చో, చీర మార్చుకుని వస్తాను... తెలిసినామె ఉంది. ఆమెను అడుగుదాం'... ధైర్యం చెప్పి లోపలకు వెళ్లిందామె. లలిత దిక్కులు చూస్తూ కూర్చుంది. ఇంతలో తలుపుతట్టిన శబ్దం విన్పించింది. తలుపుతీసింది లలిత. రాంబాయమ్మ గారి కోడలు లోపలకు వచ్చింది.

'ఎవరూ?'... అంటూ లోపల్నుంచి రాంబాయమ్మ ప్రశ్నించింది.

'మీ కోడలు వచ్చిందండి'.... సమాధానమిచ్చింది లలిత. కోడలు రమ నవ్వుతూ 'ఎప్పుడు వచ్చారు ఆంటీ?'...అని లలితను అడిగి లోపలకు వెళ్లింది. ఎంతయినా రాంబాయమ్మ గారు మంచి అత్తగారు...లలిత మనసులో మళ్లీ ఆలోచనల సుడి. భర్త లేని ఆమె వికలాంగుడైన ఒక్కగానొక్క కొడుకును తాను టైలరింగ్ చేస్తూ డిగ్రీ వరకు చదివించింది. అతను కూడా ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండేవాడు. పెళ్లి కూడా చేసింది. రమ ఇంటర్‌తో చదువు ముగించింది. పెళ్లయిన ఎనిమిది నెలలలోపే అనుకుంటా ఆమె కొడుకు బస్సు దిగుతూ కుంటికాలుతో బ్యాలెన్స్ తప్పి కిందపడిపోయాడు. బస్సు అతని మీద నుంచి వెళ్లిపోయింది. అంతే పరిస్థితి మొత్తం మారిపోయింది. తల్లిగా ఆమె జీవచ్ఛవంలా అయి





పోయింది. అయినా కోడలు పసుపు కుంకుమ తీసి వెయ్యాలని ఆమె పుట్టింటి వారు ఏర్పాట్లు చేస్తుంటే సహించలేకపోయింది. రమకు అండగా నిలిచింది. ఇష్టం అయిన వారు ఉంటే ఉండండి, లేకపోతే వెళ్లిపోండి అని వచ్చిన వారికి సూటిగా చెప్పడంతో అందరూ అవాక్కయ్యారు. రమ పుట్టింటి వారు విసురుగా వెళ్లిపోయారు. ఆనాటి నుంచి రమను ఆమె తన బిడ్డగానే చూసుకుంటోంది. ఆమె కూడా అత్తగారినే 'అమ్మా!' అని పిలుస్తుంది. డిగ్రీలో జాయిన్ చేసి చదివిస్తోంది. కొంతకాలం గడిచిన తర్వాత రమకు పెళ్లి చేయాలనేది రాంబాయమ్మ గారి ఆలోచన. తను ఇక్కడకు వచ్చిన కొద్దికాలంలోనే ఇదంతా జరిగిపోయింది. లలిత మనసు బాధతో మూలిగింది. ఇంతలో రాంబాయమ్మ బైటకు వచ్చింది.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నడిచారు. నాలుగు రోడ్లు దాటి అనుకున్న ఇంటికి వచ్చేశారు. ఆ ఇంటామె దుర్గమ్మ విషయం తెలుసుకుని ముందుగానే వడ్డీ తీసుకుని ఆరొందల చిల్లర చేతిలో పెట్టింది.

హమ్మయ్య... ఒక గండం గడిచింది. చిన్నా స్కూలు ఫీజు దొరికింది...అని గుండెలపై చేయి వేసుకుని ఆ రోజు రాత్రి గాఢంగా నిద్రపోయింది లలిత.

★★★

ఆ మరునాడు కుక్కపిల్ల లలిత చుట్టూ తిరగడం మొదలుపెట్టింది. రెండురోజులు దానికి తిండి పెట్టేసరికి తన చుట్టూనే తిరుగుతోంది. 'పిచ్చిది'... అది తోక వూపుకుంటూ ఇంట్లో తిరుగుతుంటే తనకూ ముద్దుగానే ఉంది. అయినా సరే...దాన్ని రేపు పంపించేయాల్సిందే... మనసులో గట్టిగా తీర్మానించుకుంది.

చిన్నా! బాల్ విసిరేసి...'టామీ ... వెళ్లి తీసుకురా!' అని చెప్తున్నాడు. వాడు చెప్పినట్లు అది చేస్తోంది. మధ్య మధ్యలో అక్కడే కూర్చుని ఉన్న లలితను చూస్తూ మారాం చేస్తున్నట్లుగా కుయ్యి కుయ్యిమంటూ ఆమె చీర కుచ్చిళ్లతో ఆడుకుంటోంది. అలా చేస్తున్నా దాన్ని కసురుకోబుద్ధి పుట్టలేదు లలితకు. ముచ్చటగా అన్పించింది. దానిని సవరదీస్తూ 'పో...పోయి ఆడుకో!'...అని చెప్పింది. కానీ ఎందుకో దానికి హుషారు లేదు. తనను చూసిన చూపులో నీరసం కన్పిస్తోంది.

చిన్నా బాల్ విసిరేసి తెమ్మని దాన్ని పిలుస్తున్నాడు. హుషారు లేకుండానే వెళ్లి తెచ్చిస్తూ చిన్నా కాళ్ల దగ్గర కూలిపోయింది. వాంతులు చేసుకుంటోంది. దాంతో బిత్తరపోయాడు వాడు...' అమ్మా! టామీ కక్కుకుంటోంది' అని పెద్దగా అరిచాడు.

లలిత కాళ్లూ చేతులు వణికినట్లయ్యాయి. కంగారుగా వెళ్లి చూసింది. ఎంతో నీరసంగా ఆమె కళ్లలోకి చూసింది టామీ. ఆ చూపు చూసేసరికి అప్రయత్నంగానే దాన్ని చేతుల్లోకి తీసుకుంది. 'ఏమైందమ్మా నీకు?'...అని అడుగుతూనే మరో చేత్తో పర్సును తీసుకుని 'చిన్నా ఇంటికి తాళం వెయ్యి... డాక్టర్ దగరకు వెళ్దాం!' అని చెప్పి బయటకు పరుగుతీసింది. చిన్నా రాగానే ఆటోను పిలిచి తనెప్పుడో చూసిన డాక్టర్ అడ్రస్‌ను గుర్తుకుతెచ్చుకుని అక్కడకు పోనివ్వమని చెప్పింది. టామీ మూలుగుతూ వాంతులు చేసుకుంటూనే ఉంది. తన చీర ఖరాబయినా ఆమె పట్టించుకోలేదు. దాన్ని భయం లేదన్నట్లుగా సవరదీస్తూనే ఉంది. ఆస్పత్రి దగ్గరకు రాగానే లలితనే చూస్తుండిపోయింది. ఆ చూపులో జీవం లేదు. ఏమిటిదిలా అయిపోతోంది. లలితకు కంగారుగా ఉంది. పరుగున డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లింది. ఆయన చూసి 'సారీ! అమ్మా! ప్రాణం పోయింది' అని చెప్పాడు.

లలితకు ఒక్కసారిగా ఏడుపు తన్నుకొచ్చింది. దాన్ని కాపాడుకోలేకపోయాననే అన్న బాధ పెల్లుబుకుతోంది. చిన్నా ఆమె చీర పుచ్చుకుని పెద్దగా ఏడుస్తున్నాడు. వాడి ఏడుపు విన్పించగానే తన బాధ్యత గుర్తుకొచ్చింది. వాడిని దగ్గరకు తీసుకుంది. బైటకు వచ్చి ఆటో ఎక్కింది. చేతిలో ఉన్న టామీని ఏం చేయాలో ఆమెకు అర్థం కాలేదు. శ్మశానానికి వెళ్లింది.

ఆమెను చూసి అక్కడున్న అతను వచ్చాడు. ఆమె చేతిలో కుక్కపిల్లను చూశాడు. పరిస్థితి అర్థమైపోయింది. రెండువేలు ఇమ్మని అడిగాడు. ఆమె పర్సు తీసింది. తన దగ్గరున్న అయిదొందలను అతని చేతిలో పెట్టింది. ' నా దగ్గరున్నది ఇదే. కానీ టామీకి చేయాల్సింది చెయ్యి....' అని చెప్పింది. అతను మారు మాట్లాడలేదు. టామీని అతనికి అప్పగించినపుడు తనలోని భాగమేదో కోల్పోయినట్లు అన్పించిందామెకి. అంతా అయిన తర్వాత బయలుదేరింది. మనసు వేదనాభరితమైపోయింది. చిత్తరపోయి ఏడుస్తున్న చిన్నాభుజంపై చెయ్యి వేసి నడిపించుకుంటూ వెళ్లిపోయింది.

★